విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యం

- జిల్లా అదనపు సెషన్స్ జడ్జి టి.మంగాకుమారి
- ఘనంగా మహిళా దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని, ప్రతి విద్యార్థిని విద్యలో రాణించి ముందడుగు వేయాలని జిల్లా అదనపు సెషన్స్ జడ్జి టి.మంగాకుమారి అన్నారు. బుధవారం ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కళాశాలలో ప్రతి తరగతిలోనూ విద్యార్థినిలే అకడమిక్ టాపర్లుగా నిలవడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. భవిష్యత్‌లో కూడా విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించి అన్ని రంగాల్లో ప్రథమ స్థానం సాధించాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్స్‌పాల్ బాలకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో మహిళలు అన్ని రంగాల్లో సత్తాచాటుతూ ఉన్నత స్థానాలు అధిరోహిస్తున్నారని అన్నారు. విద్యారంగంతో పాటు ఇతర అన్ని రంగాల్లో మహిళలకు సరైన అవకాశాలు కల్పిస్తే మరింత ఎత్తుకు ఎదుగుతారన్నారు. అనంతరం జడ్జి మంగాకుమారిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో..

స్థానిక జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయవాడ జోన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని అదేవిధంగా ఆర్టీసీలో కూడా కండక్టర్లుగా, డిపో మేనేజర్, సూపర్‌వైజర్, సెక్యూరిటీ విభాగాల్లో కీలకంగా తమ ఉద్యోగ బాధ్యతలు అందిస్తున్నారన్నారు. దేశ రక్షణలో కూడా మహిళల పాత్ర అద్భుతంగా ఉందని, స్త్రీ శక్తి సంపన్నమైన దేశం అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటుందన్నారు. జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీలో అన్ని విభాగాల్లో మహిళలు అద్భుత సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు ఈ కార్యక్రమంలో ఏలూరు రోటరీ క్లబ్ సెక్రటరీ శ్రీమతి వంకదారు శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు మహిళా కండక్టర్లను, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌ను, సెక్యూరిటీ కానిస్టేబుల్‌ను ఉత్తమ మహిళా ఉద్యోగులుగా సత్కరించి వారికి నగదు, ప్రశంసా పత్రాలు బహుకరించారు. ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి , డీపీటీఓ ఆఫీసు సూపర్‌వైజర్ పి.వేణుగోపాలరావు పాల్గొన్నారు.


జడ్జి మంగాకుమారికి జ్ఞాపిక అందిస్తున్న ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు


దొండపాడు పరివర్తన పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం


లంకపేటలో మాట్లాడుతున్న నమ్మిన లక్ష్మీ కుమారి


ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను సన్మానించిన సిబ్బంది


పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్న శ్రామిక మహిళలు

శ్రామిక మహిళలకు కనీస వేతనాలు అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్) : నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక వన్ టౌన్ వంగాయగూడెం రామాలయం సెంటర్లో ఐద్వా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఐద్వా నాయకురాలు కళ్యాణి మాట్లాడుతూ దేశంలో మహిళలపై రోజుకు రోజుకు అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళలకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఐద్వా నాయకులు ఉషారాణి, భారతి, కమల కుమారి, రోహిణి, పావని, నాగదేవి, అమ్మాజీ, పుణ్యవతి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

స్థానిక లంకపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వైజ్ సంస్థ డైరెక్టర్ నమ్మిన లక్ష్మీకుమారి మాట్లాడుతూ మహిళలు ఆత్మ స్థైర్యంతో మహిళా సాధికారత సాధించాలన్నారు. విద్య, ఆర్థిక రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు మేతర అజయ్ బాబు మాట్లాడుతూ మహిళలకు హక్కులు, స్వేచ్ఛ సాధించేలా మార్పు జరగాలని, మహిళలను గౌరవించాలన్నారు. డీబీఆర్సీ జిల్లా కన్వీనర్ ఎస్.జ్యోతి, కేఎల్ఎస్ రెడ్డి మాట్లాడారు. అనంతరం మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో శివ దుర్గ, ఝాన్సీ, జ్యోతి, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పీవో డబ్ల్యూ ఆధ్వర్యంలో...

స్థానిక చేపల తూము సెంటర్‌లో శ్రామిక మహిళలతో నిర్వహించిన సభలో పీఓడబ్ల్యూ నాయకురాలు ఎస్ అమ్మాజీ మాట్లాడారు. సమాజంలో స్త్రీల పట్ల చులకన భావం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. స్త్రీ, పురుషులు కలిసి సమసమాజం కోసం పోరాడాలని విజ్ఞప్తి చేశారు. పీఓడబ్ల్యూ నాయకురాలు మహాలక్ష్మి, ఈ.లక్ష్మి, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, శ్రామిక మహిళలు రాఘవ, సీత, జగదేశ్వరి, సోమమ్మ పాల్గొన్నారు.

ఏలూరు రూరల్ : మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక దొండపాడు పరివర్తన బధిరుల పాఠశాలలో దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వెస్ట్‌గోదావరి బ్యాంక్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ డి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఉలమా లక్ష్మీ, జి.కోమల, సి.వెంకటలక్ష్మీ, వి.గౌతమిలను సత్కరించారు. ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో డీడీఆర్‌సీ జోనల్ సెక్రటరీ ఎస్ లక్ష్మణరావు, బి.గాయత్రి, ఎం.దీపిక, ఎ శారద పాల్గొన్నారు.

ఎంపీడీవో ప్రణవికి సత్కారం

ఏలూరు మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ బి.ప్రణవిని కార్యాలయ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సూపరింటెండెంట్ వై సుజాత, ఏపీఓ కిషోర్‌తో పాటు సిబ్బంది కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మండలశాఖ నిర్వహించిన సదస్సులో మహిళా ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ భార్య షేక్ శుభానిబేగం డి శేషారత్నం, ఎల్ కనకదుర్గ, రాజ్యలక్ష్మీ, ఎంవీ లక్ష్మీలను ఘనంగా సత్కరించారు. స్థానిక మండలపరిషత్ పాఠశాలలో స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. క్లబ్ సభ్యులు లేళ్ల వెంకటేశ్వరరావు, వీఆర్ కృష్ణారావు, పి మురళీకృష్ణ, మారగాని శ్రీనివాస్, ముస్తాఫా ఆలీ తదితరులు మహిళ ఉపాధ్యాయులు కె శ్యామలదేవి, కృష్ణవేణి, సంతోషమ్మలను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కందుల రాంబాబు, ఉపాధ్యాయులు దేవీప్రసాద్, జె స్టీవెన్, స్వామిగణేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సరమ్మ సన్నిధిలో ఎంపీ శ్రీధర్


సరమ్మను దర్శించుకుంటున్న ఎంపీ శ్రీధర్, వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం : లింగపాలెంలో శ్రీసరమ్మ తల్లి పేరంటాళ్ల మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ దర్శించుకున్నారు. ఆయన, పార్టీ నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సరమ్మ తల్లికి ఎంపీ శ్రీధర్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన ఎంపీ వెంట జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, లింగపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొఠారి మోహనరావు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు పి.వేమనరెడ్డిని ఎంపీ కోటగిరి శ్రీధర్ పరామర్శించారు. ఇటీవల మోకాలు ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న వేమనరెడ్డిని పరామర్శించి త్వరగా కోలుకోవాలన్నారు.

దుర్గమ్మను దర్శించిన బాలరాజు


కనకదుర్గమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు దంపతులు

బుట్టాయగూడెం : రెడ్డిగణపవరంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. కనకదుర్గమ్మ, అన్నపూర్ణ, విశ్వేశ్వర స్వామి ఉత్సవాలు రెండో రోజు కావడంతో గిరిజన ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలవచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గుండె సంబంధిత చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు జాతరకు విచ్చేశారు. కనకదుర్గమ్మ తల్లికి బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు, కుమారుడు సాయి విశాల్, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కనకదుర్గమ్మ అన్నపూర్ణ, విశ్వేశ్వర స్వామివారికి నూతన వస్త్రాలను సమర్పించారు. తొలుత ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లూరి రత్నాజీరావు, ధర్మకర్తలు భౌమరాజు సత్యనారాయణరాజు, భౌమరాజు ధనుంజయ రాజు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, యాండ్ర రవి, కణితి దుర్గారావు ఎమ్మెల్యే బాలరాజుకు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలను జరిపించారు. ఎస్సై ఎం.జయబాబు బందోబస్తు నిర్వహించారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

దెందులూరు: ఈ నెల 22న దేవతామూర్తుల గ్రామోత్సవం, శోభాయాత్ర నిర్వహించనున్నట్టు శ్రీరామదండు కమిటీ నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. దెందులూరులో అర్చకులతో మహానివేదన చేస్తున్న 9 ఆలయాల ఉత్సవ విగ్రహాలను 9 రథాలపై ఊరేగిస్తామన్నారు. ఉదయం 10.45 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. హిందూ ధర్మం పరిరక్షణకు తెలుగు సంస్కృతి సంప్రదాయాలను మరింత బలపరిచేందుకు 108 మంది ముత్తైదువులతో గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పిస్తామన్నారు. ప్రతి గుమ్మానికి మామిడి ఆకు తోరణాలు కట్టి దాదాపు 4 వేల హనుమాన్ జెండాలను పంపిణీ చేస్తామన్నారు. కమిటీ సభ్యులు రాజేష్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా తెలుగు క్యాలెండర్‌ను ముద్రించామన్నారు.

తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి


పార్టీ నాయకులతో పరిస్థితిని సమీక్షిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్లనాని

ఏలూరు టౌన్ : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలుస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో సైతం సముచిత స్థానం కల్పించి ఆయా వర్గాలకు రాజకీయాల్లోనూ అవకాశం కల్పిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్లనాని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం అవుతోన్న నేపథ్యంలో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి తాజా పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం ఏలూరు నగరపాలక సంస్థకు తొలి సారిగా ఎన్నికైన పలువురు కార్పొరేటర్లకు ఎమ్మెల్సీ ప్రాధాన్యత ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తూ మాక్ ఓటింగ్ చేపట్టేందుకు పార్టీ నేతలతో సమీక్షించారు. ఎన్నికల విధానం, ఓటు వేసే విధానంపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, పార్టీ నేతల విజయానికి నమ్మకంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని, అవకాశం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖచ్చితంగా పదవులు ఇచ్చి గౌరవిస్తారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని, వారికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే నాని సూచించారు. గురువారం ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాక్‌ఓటింగ్ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల ఏలూరు నియోజకవర్గ పరిశీలకులు మధ్యాహ్నపు బలరాం, ఎస్ఎంఆర్ పెదబాబు, బండారు కిరణ్, ఇతర సీనియర్ నాయకులు పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్ పొలిమేర దాసు, బండారు కిరణ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలి

దెందులూరు: పెండింగ్ కేసులు లేకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పెదవేగి సీఐ ఎన్.దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి దెందులూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల్లో లోక్ అదాలత్, ట్రాఫిక్, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, పోలీస్‌స్టేషన్ పరిశీలించారు. ఎస్సై ఐ.వీర్రాజు, సిబ్బంది విధి నిర్వహణపై సీఐ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్థిక సహాయం అందజేత

కామవరపుకోట : ఇటీవల దేవులపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవులవెంకన్న కుటుంబానికి బుధవారం సోషల్ వర్కర్స్ టీం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. దాతల నుంచి సేకరించిన రూ.23 వేలు నగదు, 50 కేజీల బియ్యం వెంకన్న కుటుంబ సభ్యులకు అందజేసినట్లు సోషల్ వర్కర్ వీరమల్ల మధు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ కడిపి పాపారావు, మున్నంగి శ్రీనివాస్, వీరమల్ల సాజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలి

ఏలూరు (టూటౌన్) : బీసీ మహిళలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం, బీసీ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదపాడు జెడ్పీటీసీ గంటా పద్మశ్రీ, ఉపాధ్యాయురాలు ఎస్.ఉషారాణిలను సత్కరించారు. ఈ సందర్భంగా లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగితేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. కేబినేట్‌లో 9 మంత్రి పదవులు బీసీలకు ఇవ్వగా వీరిలో నలుగురు మహిళలే ఉన్నారన్నారు. మహిళా రక్షణకు దిశా చట్టం తీసుకువచ్చారన్నారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, ఆసరా పథకం, రాష్ట్రంలో 33 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని మహిళలకు అగ్రతాంబూలం వేస్తున్నారన్నారు. నగర మేయర్, సాహిత్య అకాడమీ చైర్మన్, ఈడా చైర్మన్, 28 మంది బీసీ కార్పొరేటర్లు వంటి అనేక పదవులు బీసీలకు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విఠల్ కుమార్, ఏసురాజు, రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షులు లంక వెంకటేశ్వరరావు, మహిళా నాయకులు గుత్తల బాలత్రిపుర సుందరి, ఉక్కుసూరి గోపాలకృష్ణ, జరజాపు రఘు, ఇదలాడ నాని, అబ్బిరెడ్డి రంగముత్యాలు, బాయి వెంకట్రావు, కొండల ప్రసాద్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.


పెదపాడు జెడ్పీటీసీ గంటా పద్మశ్రీ, ఉపాధ్యాయురాలు ఉషారాణిలను సత్కరిస్తున్న నాయకులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	10
బెండకాయలు	60	కంద	40
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	48
బీరకాయలు	48-58	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	60	అల్లం	70
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	16	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	18	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	36-48	బజాజీ	50
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	22
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కృషి


డాక్టర్ మానసను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో) : జిల్లాలో ప్రజలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న జిల్లా ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా సీహెచ్.మానస అభినందనీయురాలు అని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యురాలు మానసను కలెక్టర్ వెంకటేష్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యురాలు మానస ప్రజలకు దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే ఎన్‌సీడీ సర్వే ద్వారా గుర్తించి వారికి మెరుగైన వైద్య సహాయం అందించారని, అలాగే పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది డా.మానసను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, డీఆర్‌వో ఏవీఎస్ఎస్.మూర్తి, జిల్లా పరిషత్ సీఈఓ కె.రవికుమార్, జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారి నాగరాణి, పోలవరం డీఎస్పీ లతాకుమారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎన్‌జీవో నాయకులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం. పంగిడిగూడెంకు చెందిన తైదుల రమ్య అదే గ్రామానికి చెందిన అబ్బదాసరి నాగు వద్ద ఐదేళ్ల క్రితం కొంత నగదును అప్పుగా తీసుకుంది. అయితే రూ. 60 వేలు తిరిగి చెల్లించగా, ఇంకా రూ. 5 వేలు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో నగదు కోసం బుధవారం రమ్య ఇంటికి వెళ్లిన నాగు ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు, తిట్టినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com